

ఆంధ్రజ్యోతి
జయశంకర్ 3 భూపాలపల్లి, ములుగు
ఆదివారం 2 జూన్ 2024

తిరగబడ్డ... పోరుగడ్డ!

తెలంగాణ ఉద్యమంలో 'వరంగల్' కీలక పాత్ర

- ఎందరో ఆత్మబలిదానం
- ఊపునిచ్చిన మూడు సభలు
- కీలక భూమిక పోషించిన కేయూ
- జాక్‌తో ఏకమైన ఉద్యోగులు
- ఆటా పాట, వంటావార్పుతో హోరెత్తిన రోడ్లు
- చెరగని ముద్రగా మానుకోట ఘటన..
- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు

5



రైల్‌రోకోలో పాల్గొన్న ఉద్యమకారులు

లాఠీ దెబ్బలు, తూటాలను సైతం లెక్కచేయని మొండితనం.. ప్రాణత్యాగాలను సైతం లెక్కచేయని స్వరాష్ట్ర ఆకాంక్ష.. ఆంధ్రా పాలకుల చేతుల్లో నలుగుతున్న తల్లి తెలంగాణకు విముక్తి కల్పించాలన్న ధృఢ సంకల్పం.. విజయమో, వీరస్వర్గమో అన్న రీతిలో సాగిన పోరు.. ఎగిసేటి సంద్రంలా.. దూకే కెరటంలా సాగిన మహోన్నత పోరాటం.. స్వరాష్ట్ర సాధనతోనే తమ బతుకులు బాగుపడుతాయన్న నమ్మకం.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ఏకైక ఎజెండాగా సాగిన గొప్ప పోరాటం. చినుకు చినుకు కలిసి మహాసంద్రంగా మారినట్లుగా పిడికెడు మందితో ప్రారంభమైన ఉద్యమం.. ప్రపంచంలో అతిపెద్ద ప్రజా పోరాటంగా రూపుదిద్దుకుంది. ఉవ్వెత్తున సాగిన తెలంగాణ తొలి, మలి ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు అద్వితీయమైన పాత్రను పోషించారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన ఎన్నో కీలక ఘట్టాలు, భారీ బహిరంగ సభలు, సదస్సులు వరంగల్ జిల్లా కేంద్రంగానే సాగాయి. ఉద్యమం సందర్భంగా తీసుకున్న ప్రతీ కీలక నిర్ణయం, ఇచ్చిన పిలుపునకు ఉమ్మడి వరంగల్ వేదికగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ఎలుగెత్తుతూ నిర్వహించిన భారీ బహిరంగ సభలకు ఓరుగల్లే వేదికైంది. తెలంగాణలోని అన్ని జిల్లాల కన్నా మిన్నగా వరంగల్ ఉద్యమంలో అగ్రభాగాన నిలిచింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాటి పోరాట గురుతులు, అమరుల ఆత్మబలిదానాలు, పలు కీలక ఘట్టాలపై ప్రత్యేక కథనం..

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

ఘనంగా హనుమాన్ జయంతి
ఊరూరా వేడుకలు
వివరాలు 6వ పేజీలో...

సంబరాలకు సర్వం సిద్ధం

- నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- ముస్తాబైన కార్యాలయాలు



విద్యుత్ కాంతులతో ముస్తాబైన భూపాలపల్లి సమీకృత కలెక్టరేట్

భూపాలపల్లిటౌన్/ములుగు కలెక్టరేట్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఆదివారం ఘనంగా జరుగనున్నాయి. భూపాలపల్లి సమీకృత భవనంతోపాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలను ఈ మేరకు ముస్తాబు చేస్తున్నారు. ప్రభుత్వ భవనాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.



ములుగు కలెక్టరేట్ ఆవరణలో టెంట్లు వేస్తున్న సిబ్బంది

ఉదయం 8.42 గంటలకు పోలీసు శాఖ జిల్లా కార్యాలయంలో అమరవీరుల స్తూపానికి కలెక్టర్ భవేష్ మిశ్రాతోపాటు ఎస్పీ కిరణ్ ఖరే నివాళులు అర్పిస్తారు. 8.52గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం. 9గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరిస్తారు. జిల్లాలోని అమరవీరుల కుటుంబాలను పలువురిని ఎంపిక చేసి హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి పంపించినట్లు అధికారులు తెలిపారు.

ములుగు కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమాలకు కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టెంట్లు, వేదికను సిద్ధం చేశారు. ఉదయం 9గంటలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టడం లేదు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరాం పిలుపుతో జిల్లాకు చెందిన అనేకమంది ప్రజాసంఘాల నాయకులు పాల్గొనగా హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలో పాల్గొనాల్సిందిగా వారికి ఆహ్వానం అందగా కొందరు బయల్దేరి వెళ్లారు.

కరెంటు తీగలు తాకి యువకుడి మృతి



ప్రవీణ్ మృతదేహం

మహదేవపూర్, జూన్ 1: వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు తాకి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మద్దులపల్లి అటవీ ప్రాంతంలో శనివారం చోటుచేసుకుంది. కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొల్లూరు బోరంపెల్లికి చెందిన మతి స్థిమితం సరిగా లేని దుర్గం ప్రవీణ్ (29) తన అమ్మమ్మ ఇంటికి మద్దులపల్లికి వచ్చాడు. శనివారం తిరిగి బయల్దేరిన అతడు అక్కడికి చేరుకోలేదు. దీంతో సోదరుడు ప్రదీప్ వెతకగా అటవీ ప్రాంతంలో ప్రవీణ్ మృతదేహం కనిపించింది. వన్యప్రాణుల కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ వైర్లు తాకడం వల్ల షాక్ తగిలి మృతి చెందినట్లు గుర్తించాడు. సంఘటన స్థలాన్ని చేరుకున్న కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభం

గణపురం, జూన్ 1: చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు మొదటి దశ 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని శనివారం సాయంత్రం పునఃప్రారంభించారు. రెండు రోజుల క్రితం బాయిలర్ ట్యూబ్‌లో లీకేజీ సమస్య తలెత్తడంతో అధికారులు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. మరమ్మతులు చేపట్టి విద్యుత్ ఉత్పత్తిని పునఃప్రారంభించినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. రెండో దశ 600 మెగావాట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

'దేవాదుల' పంపింగ్ ప్రారంభం

కన్నాయిగూడెం, జూన్ 1 : మండలంలోని గుట్టల గం గారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తి పోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్‌ను శనివారం ప్రారంభించారు. ఫేజ్-3 నుంచి రెండు మోటార్లు ప్రారంభించి 583 క్యూసె క్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. బ్యారేజీలోని పూర్తి నీటి సామర్థ్యం 6.94 టీఎంసీల కాగా ప్రస్తుతం 1.47 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద నీటిమట్టం 75.10 మీటర్లు నమోదైంది. సమ్మక్క సాగర్ వద్ద 75.25 మీటర్ల నీటిమట్టం ఉంది.

రేపటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ

ములుగు కలెక్టరేట్, జూన్ 1: పదోతరగతి సప్లిమెం టరీ పరీక్షలు ఈనెల 3 నుంచి జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 176 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా వారికి ఈనెల 3 నుంచి 13 వరకు బండారుపల్లిలోని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్‌లో పరీక్షలు జరు గుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లతో పరీక్ష కేంద్రానికి గంటముందే చేరుకోవాలని సూచించారు.

తూకంలో తేడా వస్తే చర్యలు

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా



వడ్ల బస్తాల తూకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

కాటారం, జూన్ 1: కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద ధాన్యం బస్తాల కాంటాలు, లారీల వేబ్రిడ్జి తూకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని భూపాలపల్లి కలెక్టర్ భవేష్‌మిశ్రా హెచ్చరించారు. మండలంలోని అంకుసాపూర్‌లో అన్నపూర్ణ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును శనివారం ఆయన తనిఖీ చేశారు. తూకంలో తేడాలుంటున్నాయని దామెరకుంటకు చెందిన పలువురు రైతులు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో రైస్ మిల్లును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దిగుమతి కోసం ఉన్న లారీల్లోని వడ్ల బస్తాలను తీయించి రైతుల సమక్షంలో జిల్లా తూనికలు, కొలతల అధికారితో తూకం వేయించారు. తూకంలో ఎలాంటి వ్యత్యాసం రాకపోవడంతో అవకతవకలు జరగడానికి ఆస్కారం లేదన్నారు. ఏ మిల్లరైనా తూకంలో అవతవకలు చేస్తే చర్యలు తప్పవని అన్నారు. తూనికలు, కొలతల శాఖ, సివిల్‌సప్లయ్ అధికా రులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అయన వెంట సివిల్ సప్లయ్స్ డీఎస్‌వో నర్సింగరావు, డీఎం రాఘవేందర్, లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి శ్రీలత తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గాయి..

హనుమకొండ టౌన్, జూన్1: ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు గతం కన్నా చాలా తగ్గాయని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం పడకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఎన్పీడీసీఎల్ వ్యాప్తంగా ఉన్న 2,804 ట్రాన్స్‌ఫార్మర్లను డిసెంబర్ 2023 నుంచి మే 2024 వరకు 3,335 వరకు పెంచి అదనంగా 531 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. వినియోగం ఎక్కువగా ఉన్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం తెలుసుకునేందుకు టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నామని, తద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్ తగ్గిందన్నారు. 25 శాతం ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు, 23 శాతం పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గాయన్నారు. ఫలితంగా వినియోగదారులకు అంతరాయాలు కనిష్టస్థాయికి తీసుకురాగలిగామన్నారు. తద్వారా ఎన్పీడీసీఎల్ పరిధిలో మార్చి 8న 15,623 మెగావాట్ల విద్యుత్ వినియోగం రికార్డు నమోదైందన్నారు. వైఫల్యాలు తగ్గడం వల్ల విద్యుత్ డిమాండ్ తారాస్థాయికి చేరిందన్నారు.

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే..
తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

- గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్
- గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

- నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

- 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక
- రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్టు కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్థక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న
- ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహా ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ ప్రాత ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎన్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

తిరగబడ్డ పోరుగడ్డ

హనుమకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి ఉద్యమం నుంచే వరంగల్ ప్రజలు పోరాటంలో అగ్రభాగాన నిలిచారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటుతో ఇటు ఉద్యమాలు, అటు రాజకీయాలతో రెండు రకాలుగా తెలంగాణ పోరాటం బలపడింది. తెలంగాణ ఉద్యమ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శనంలో ఉద్యమం ముందుకు సాగడంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ముందు వరుసలో నిలిచారు. ఉద్యమసందర్భంగా నిర్వహించిన పలు సదస్సుల, భారీ బహిరంగ సభలు, ర్యాలీల్లో వేలాదిగా పాల్గొన్నారు. జై తెలంగాణ అంటూ.. పిడికిలి బిగించి నినదించారు.

ఆ మూడు సభలు

ఓరుగల్లు కేంద్రంగా ప్రధానంగా మూడు సభలు తెలంగాణ ఉద్యమాన్ని కొత్త మలుపు తిప్పాయి. 2003 ఏప్రిల్ 27న వరంగల్ జైత్ర యాత్ర పేరిట నిర్వహించిన సభకు 17 లక్షల మంది హాజరయ్యారు. అదే సంవత్సరం డిసెంబర్ 5న జనగామలో ఓరుగల్లు వీర గర్జన పేరుతో మరో భారీ బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత 2007లో తెలంగాణ విశ్వరూప సభ భారీ ఎత్తున నిర్వహించారు. ఈ సభకు పది లక్షల మందికి పైగా పాల్గొన్నారు. 2010 డిసెంబర్ 16న హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డి పేటలో మహాగర్జన పేరుతో నిర్వహించిన ఘర్జన సభకు 25 లక్షల మంది హాజరయ్యారు. ఈ సభ గిన్నిస్‌బుక్ రికార్డులకెక్కింది. తెలంగాణ ఉద్యమాన్ని సరికొత్త మలుపు తిప్పిన కేసీఆర్ దీక్ష అరెస్టు ఘట్టంలోనూ వరంగల్ జిల్లా ప్రజలు కీలక భూమిక పోషించారు. కేసీఆర్‌కు మద్దతుగా నిర్వహించిన ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లతో ఉమ్మడి జిల్లా అట్టుడికింది. కేసీఆర్ ఆమరణ దీక్ష జరిగినకాలంలో జిల్లా వివిధ చోట్ల ఉద్యమ ఉద్వేగంతో ఏడుగురు ఆత్మబలిదానాలు చేసుకున్నారు.

ఉద్యమంలో కేయూ

తెలంగాణ ఉద్యమంలో కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు క్రియాశీల పాత్రను పోషించారు. 2010 ఫిబ్రవరి 7న కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు పొలికేక పేరుతో పెద్ద బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాలయల నుంచి లక్ష మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సభకు అఖిల భారత ఆర్య సమాజ్ అధ్యక్షుడు స్వామి అగ్నివేశ్, కె.జయశంకర్, ప్రొఫెసర్ కోదండరామ్ హాజరయ్యారు. హనుమకొండ కేంద్రంగా సాగిన అనేక ఉద్యమాల్లో వివిధ విద్యార్థి సంఘాలు ముందు నిలిచాయి. 14 విద్యార్థి సంఘాలు సంఘటితంగా ఈ సదస్సును భారీ ఎత్తున నిర్వహించాయి. రాయిని గూడెంలో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సభలో జై తెలంగాణ అంటూ నినదించడం ద్వారా విద్యార్థులు తమ ఉద్యమ కాంక్షను ఎలుగెత్తిచాటారు. రాళ్లు రువ్వి నిరసన తెలిపారు.

జేఏసీ కీలక భూమిక

తెలంగాణ విషయంలో రాజకీయ పక్షాలు దోబూచులాడుతుండడంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి 2009 డిసెంబర్ 24న తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు కావడంలో వరంగల్ జిల్లాకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులే కీలక పాత్ర పోషించారు. ఆటపాట, వంటావార్పు తదితర అనేక రూపాల్లో తెలంగాణ ఉద్యమం సాగింది. ప్రతీ పల్లె, ప్రతీ పట్టణం పోరుబాట పట్టింది. బతుకమ్మ ఆటలతో ఊగిపోయింది.

వంటవార్పు, ధూం ధాంలు..

తెలంగాణ ఉద్యమంలో ప్రజలు తమ సంఘటిత శక్తిని చాటడానికి చేపట్టిన అనేక ఆందోళన రూపాల్లో వంటా వార్పు ఒకటి. ప్రజలంతా రోడ్లమీదికి వచ్చి ప్రధాన రోడ్లు, జంక్షన్లలో రోడ్లపైనే వంటలు చేశారు. అక్కడే కూర్చొని బంతి భోజనం చేశారు. వంటావార్పు కార్యక్రమంలో మహిళలు రోడ్లపై బతుకమ్మలు ఆడారు. ప్రజలు కళాప్రదర్శనలు ఇచ్చారు. ఉద్యమ కాలంలో పౌరుషాగ్నిని రగిలించే ఆటపాటలతో నిర్వహించిన మరో ఆందోళన కళారూపం ధూం ధాం. ఉద్యమానికి ఎంతో ఊపునిచ్చిన ధూం ధాం నిర్వహణలోనూ ఉమ్మడి వరంగల్ ముందు భాగాన నిలిచింది. వరంగల్‌కు చెందిన అనేక మంది జానపద కళాకారులు, గాయకులు, కవులు తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఉరికించారు.

బలిదానాలు

ఉద్యమమే ఊపిరిగా బతికిన ఉద్యమకారులెందరో తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మబలిదానాలు చేశారు. పరుగెత్తుతున్న రైళ్లకు ఎదురెళ్లి జై తెలంగాణ అంటూ ఆత్మార్పణలకు పాల్పడ్డారు. ఒంటిపై కిరోసిన్ పోసుకొని తమను తాము ఆత్మాహుతి చేసుకున్నారు. 1969 ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 119 మంది బలైతే మలి ఉద్యమంలో 362 మంది ప్రాణత్యాగం చేశారు. తెలంగాణ ఉద్యమంలో అప్పటి ఉమ్మడి పది జిల్లాల్లో మొత్తం 1,250 మంది ఆత్మబలిదానాలు చేసుకుంటే అందులో ఎక్కువమంది ఉమ్మడి వరంగల్ జిల్లావారే ఉన్నారు. ఎందరో వీరుల పోరాటం, మరెందరో అమర వీరుల ఆత్మబలిదానాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది.

మానుకోట ఘటన

మానుకోట ఘటన తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పింది. 2010 మే 28న సమైక్య నినాదంతో ఓదార్పు యాత్రకు వైఎస్ జగన్‌ను బయలు దేరారు. పార్లమెంటులో సమైక్య ప్లకార్డులు ప్రదర్శించిన జగన్ తెలంగాణలో కాలుమోపన్వివమని, అందులో ఓరుగల్లు గడ్డపై అడుగు పెట్టనివ్వమని రాజకీయ జేఏసీతో పాటు, పలు విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. జగన్‌ను స్వాగతించేందుకు సమైక్యవాదులు, అడ్డుకునేందుకు తెలంగాణవాదులు చెరోవైపు మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో మోహరించారు. ఉద్యమకారులను సమైక్యవాదులు రెచ్చగొట్టడంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. సమైక్యవాదుల తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి కంకరరాళ్లనే ఆయుధాలుగా చేసుకొని ప్రతిఘటించారు. తెలంగాణ ఉద్యమకారులు పోలీసుల తుపాకీ తూటాలకు ఎదురొడ్డి నిలిచారు. మానుకోట రైల్వేస్టేషన్‌లో పెద్దఎత్తున గుమిగూడిన జనం జగన్‌తోపాటు ఆయన అనుచరులకు వ్యతిరేకంగా 'జగన్ గోబ్యాక్'.. అంటూ వెయిటింగ్ రూమ్‌లోకి దూసుకు వచ్చే ప్రయత్నం చేశారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఉద్యమకారులపై దాడికి దిగారు. వెంటనే రెండో ప్లాట్‌ఫారమ్ నుంచి ఉద్యమకారులు రాళ్లతో దాడి చేశారు. పోలీసులు కాల్పులు జరగపడంతో 15 మంది, రాళ్ల దెబ్బలకు మరో 25మంది గాయపడ్డారు. రైల్వేస్టేషన్ రణరంగంగా మారింది. ఆ తర్వాత కాలంలో ఈ ఘటనే తెలంగాణ ఉద్యమానికి మరింత స్ఫూర్తిగా నిలిచింది.

వడదెబ్బతో ముగ్గురి మృతి


నర్సింహరావు (ఫైల్)


రాము (ఫైల్)

వాజేడు/మంగపేట/చిట్యాల, జూన్ 1: ఎండవేడికి తాళలేక ములుగు జిల్లాలో ఇద్దరు, భూపాలపల్లి జిల్లాలో ఒకరు శనివారం మృతి చెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్.కొత్తగూడేనికి చెందిన గొర్ల నర్సింహరావు (50) ములుగు జిల్లా వాజేడులోని చంద్రుపట్లలో నివాసం ఉంటూ ఆర్ఎంపీగా కొనసాగుతున్నాడు. జాతరలో పాల్గొనేందుకు సొంత ఊరు ఆర్.కొత్తగూడెం వెళ్లి వచ్చిన అతడు శుక్రవారం వడదె బ్బకు గురయ్యాడు. రాత్రి సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మంగపేట మండలం గంపోని గూడానికి చెందిన చామకూరి రాము(39) ఇసుక క్వారీలో కూలీగా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం తీవ్ర అవస్థతకు గురైన ఆయన్ను ఏటూరు నాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమ ధ్యలో మృతిచెందాడు.

భిక్షాటన చేస్తూ..

ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురై ఒకరు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి చిట్యాల మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... రేగొండ మండల రంగయ్యపల్లి గ్రామానికి చెందిన త్రికోవెల రంగయ్య (52) కొద్ది సంవత్సరాలుగా మండల కేంద్రంలో బస్టాండ్ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ నివసించేవాడు. అధిక ఎండతో ఆయన అస్వస్థతకు గురికావడంతో స్థానికులు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించగా అప్పటికే రంగయ్య మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడు అవివాహితుడు కాగా తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందారు. మృతుడి తమ్ముడు గోవర్ధర్ అదే గ్రామంలో నివస్తున్నాడు.


రంగయ్య మృతదేహం

ఘనంగా హనుమాన్ జయంతి


గోదావరి తీరం వద్ద దీక్ష విరమణ చేస్తున్న మాలధారులు

మహదేవపూర్, జూన్ 1: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని కాళేశ్వరంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండం చెరువు గట్టుపైన ఉన్న హనుమాన్ ఆలయంతోపాటు అడవిలో వెలసిన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరం వచ్చిన హనుమాన్ దీక్షాపరులు ఆలయంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించి, గోదావరి తీరంలో మాల విరమణ చేశారు. దీంతో కాళేశ్వరంలో సందడిగా మారింది.

● మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్లతో పాటు పలు గ్రామాలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనం తరం ఆలయాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

● కాటారం : మండలంలో హనుమాన్ పెద్ద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని ధన్వాడ శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయం, రేగులగూడెం, గంగారం, కాటారం, కొత్తపల్లి, ధర్మసాగర్, గంగపురి, దామెరకుంట, గూడూరు భక్తాంజనేయ స్వామి ఆలయాలు, గారెపల్లి అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్క రించు కుని హనుమాన్ దీక్షాపరులు, భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేదపండితులు కృష్ణమోహన్‌శర్మ, గణేష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, లక్ష్మీ కాంత్‌శర్మ, నిఖిల్ అష్టోత్తర శతనామావళి, రుద్రాభిషేకం నిర్వహించారు. మండలంలోని వందలాది మంది హనుమాన్ దీక్షాపరులు హనుమాన్ జయంతిని పుర స్కరించుకుని దీక్ష విరమణ కోసం కొండగట్టు ఆలయానికి తరలి వెళ్లారు.

● వెంకటాపురం(నూగూరు): మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని ఆలుబాక, చొక్కాల, వెంకటాపురం మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం, పెరిక బజార్‌లోని హనుమాన్ ఆలయంలో జయంతి వేడుకలు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో జరిగాయి. ఈసందర్భంగా ఆలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో చలువపందిళ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక నాయకులు దర్రా దామోదర్, మడుగూరి సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు పోలీస్ స్టేషన్ సమీపంలోని హనుమాన్ దేవాలయంలో జరిగిన వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అర్చకులు సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిగాయి. ముఖ్య అతిథిగా ఏఎస్పీ గీతే మహేష్ బాబాసాహెబ్ హాజర య్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. ఆలయ అర్చకులు, సత్సంగ్ హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు మరమ్మతులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కొత్తపల్లిగోరి, జూన్ 1: చిన్నకోడెపాక పెద్ద చెరువు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు అన్నారు. మండలంలోని చిన్నకో డెపాక గ్రామ పెద్ద చెరువును ఆయన శ నివా రం సందర్శించారు. అక్కడ జరుగుతున్న మర మ్మతు పనులను పరిశీలించారు. చెరువు మరమ్మతు పనుల కోసం రూ.3.63 కోట్లు మంజూరు చేశామని, పనులను ఖరీఫ్ సీజన్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కళలను కాపాడటం అభినందనీయం

కనుమరుగైపోతున్న కళలను నాటకాల రూపంలో ప్రదర్శిస్తూ కాపాడటం అభినం దనీయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో చిరుతల రామయణ భక్త మండలి ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జరిగే శ్రీ రామ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం ఆయన్ను వెంకటేశ్వర్లపల్లి భక్త మండలి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు.

పాఠశాలల అభివృద్ధి పనులు పరిశీలించిన కలెక్టర్

మహదేవపూర్, జూన్ 1: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం పరిశీలించారు. ఎలికేశ్వరం ఎంపీపీఎస్‌లో రూ. 3.85 లక్షలతో చేపట్టిన పనులను, బొమ్మాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో రూ. 4.55 లక్షలతో చేపట్టిన పనులను, మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో చేపట్టిన రూ. 3.20 లక్షల పనులను పరిశీలించారు. కేజీబీవీలో ప్రహరీ నిర్మాణం ఆగస్టు 15కల్లా పూర్తి చేయాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. జూన్ 20 కల్లా పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. అవసరమైతే అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, హ్యాండ్ వాష్ సౌకర్యాలు లేని పాఠశాలలు ఉండొద్దన్నారు. పూర్తి నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లు, విఓలతో మాట్లాడారు. మండ లంలో మొత్తం 26 పాఠశాలల్లో రూ.1.04 కోట్లతో పనులను చేపడుతున్నామని, వాటిని గడువుకు రెండు రోజుల ముందే పూర్తి చేయాలని అన్నారు. పనుల్లో నాణ్యత లోపించొద్దన్నారు. అంతకు ముందు పాఠశాలకు వచ్చిన కలెక్టర్‌కు డ్వాక్రా సంఘాల ద్వారా కుట్టించిన యూనిఫామ్స్ ధరించి చిన్నా రులు పూలతో స్వాగతం పలికారు. ఆయన వెంట డీఆర్డీవో నరేష్, డీఈవో రాం కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటే శ్వర్లు, పంచాయతీ రాజ్ డీఈ సాయిలు, ఏఈ రవీందర్ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తన విక్రయదారుల అరెస్టు

వరంగల్ క్రైం, జూన్ 1: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సంగెం మండలంలో రెండు ప్రాంతాల్లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న అంతర్‌రాష్ట్ర ముఠాలోని సభ్యుడితో పాటు ప్రభుత్వ నిషేధిత గడ్డిమందును విక్రయిస్తున్న మరో నిందితుడిని టాస్క్‌ఫోర్స్ స్థానిక పోలీసులు కలిసి అరెస్టు చేశారు. ఈ రెండు సంఘటనల్లో రూ.10లక్షల విలువైన 310 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, రెండు సెల్‌ఫోన్లు, రూ.1లక్ష పదివేల విలువైన 122 లీటర్ల నిషేధిత గడ్డి మందును స్వాధీనం చేసుకున్నారు. శనివారం హనుమకొండలోని కమిషనరేట్‌లో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

సంగెం మండలం గాంధీనగర్‌కు చెందిన కొడూరి శ్రీనివాస్‌రావు తన బంధువైన సూ ర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన నగా మల్లేశ్వర్‌రావుతో కలిసి నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న గుంటూరు జిల్లా పెద్దకూరపాడుకు చెందిన ఏటుకూరి సుబ్బారావు వద్ద నకిలీ పత్తి విత్తనాలు, గడ్డిమందు తక్కువ ధరకు కొనుగోలు చేశారు. రైతులకు మాయ మాటలు చెప్పి శ్రీనివాస్‌రావు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ స్థానిక పోలీసులు శనివారం దాడి చేసి నకిలీ పత్తి విత్తనాలు, గడ్డిమందు స్వాధీనం చేసుకుని శ్రీనివాస్‌రావును అదుపులోకి తీసుకున్నారు. మరో సంఘటనలో సంగెం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మెంతుల రాజేష్, ప్రభుత్వం నిషేధించిన గడ్డిమందు ఇంటి వద్ద అక్రమంగా విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీ చేసి గడ్డిమందు స్వాధీనం చేసుకుని రాజేష్‌ను అరెస్టు చేశారు. ఈ రెండు సంఘటనల్లో రూ.10లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు, 122 లీటర్ల నిషేధిత గడ్డిమందు స్వాధీనం చేసుకుని విక్రయిస్తున్న శ్రీనివాస్‌రావు, రాజేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు మల్లేశ్వర్‌రావు, సుబ్బారావు పరారీలో ఉన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదని ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు.

పెద్ద వెంకటాపురంలో ఉద్రిక్తత

భూమిని చదును చేస్తున్న రైతును అడ్డుకున్న ఫారెస్టు అధికారులు

ఒంటిపై డీజిల్ పోసుకొని నిరసనకు దిగిన రైతు


డీజిల్‌ను ఒంటిపై పోసుకున్న హుస్సేన్‌ను అడ్డుకుంటున్న గ్రామస్థులు

ఏటూరునాగారం, జూన్ 1 : వ్యవసాయం చేసుకునేందుకు భూమిని చదును చేసుకుంటున్న రైతును ఫారెస్టు అధికారులు అడ్డుకున్నారు. దీంతో అతడు ఒంటిపై డీజిల్ పోసుకొన్నాడు. అడ్డుకుంటే ఆత్మహత్య చేసుకుంటానని నిరసనకు దిగాడు. మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామ పంచాయతీ పరిధి పెద్ద వెంకటాపురంలో ఈ సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఫారెస్టు అధికారులు, రైతుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆ గ్రామంలో ఉద్రిక్తతకు దారి తీసింది.

పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు మహబూబ్ హుస్సేన్‌కు ఆదే గ్రామ శివారులో సర్వే నంబరు 50/1లో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో పంటలు వేసుకొనేందుకు ఆ భూమిని చదును చేసి మట్టిని తొలగించేందుకు రెండు ఎక్స్‌కావేటర్లు, ఏడు ట్రాక్టర్లను వినియోగిస్తున్నాడు. తొలగించిన మట్టిని ఇతర రైతులకు చేరవేస్తున్నాడు. దీనిపై కొందరు డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎఫ్‌వో స్పందిస్తూ ఏటూరునాగారం డీఆర్‌వో నరేందర్‌ను అప్రమత్తం చేశారు. పెద్ద వెంకటాపురంలో మట్టి విక్రయాలు జరుగుతున్నాయని, వెంటనే అక్కడికి వెళ్లి అడ్డుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అటవీశాఖ అధికారులు శుక్రవారం రాత్రి అక్కడికి చేరుకొని పనులను అడ్డుకున్నారు. మళ్లీ శనివారం అక్కడికి వెళ్లి రెండు ఎక్స్‌కావేటర్లు, ఏడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. దీనిపై రైతు హుస్సేన్ నిరసనకు దిగాడు. తమ పట్టా భూమిలోనే వ్యవసాయ పనులు చేసుకుంటే ఫారెస్టు అధికారులకు అభ్యంతరం ఏమిటని నిలదీశాడు. అతడికి చుట్టుపక్కల రైతులు కూడా మద్దతు తెలిపారు. అయినా ఫారెస్టు అధికారులు ససేమిరా అనడంతో హుస్సేన్ తన ఒంటిపై డీసిల్ పోసుకున్నాడు. ఫారెస్టు అధికారులు ఇలాగే వేధిస్తే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. అక్కడే ఉన్న రైతులు హుస్సేన్‌ను అడ్డుకొని ఒంటిపై పోసుకున్న డీసిల్‌ను నీళ్లతో కడిగారు. అనంతరం మిగతా రైతులతోపాటు గ్రామస్థులు, హుస్సేన్‌కు మద్దతుగా నిరసన తెలిపారు. అక్కడికి వచ్చిన అటవీశాఖ అధికారుల వాహనాలను అడ్డుకున్నారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫారెస్టు అధికారులు సమాచారం అందించారు. ఈ క్రమంలో రైతులకు, అటవీ శాఖ అధికారుల మధ్య సుమారు రెండు గంటల పాటు వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా రైతులు విలేకరులతో మాట్లాడుతూ పెద్ద వెంకటాపురం శివారులోని సర్వే నంబరు 50/1లోని భూమికి రెవెన్యూ శాఖ నుంచి పట్టాలు వచ్చాయని, అయినప్పటికీ ప్రతి ఏడాది అటవీ శాఖ అధికారులు కొత్త పోడు భూమి అంటూ పంటలు పండించుకోకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. దీనిపై డీఆర్‌వో నరేందర్ వివరణ ఇచ్చారు. ఈ భూమి సాగులో ఉన్నప్పటికీ అది అటవీ శాఖకు చెందిందగా తేలిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపడుతామన్నారు.

వివాహిత ఆత్మహత్య

మంథని, జూన్ 1: ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దపల్లి జిల్లా మంథనిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారెపల్లికి చెందిన మామిడి సమ్మక్క రెండో కూతురు పర్వవేన కల్యాణి (28)ని మంథని మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన పర్వవేన శంకర్‌కు ఇచ్చి 2013లో వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. మంథనిలోని ఎరుకులగూడెంలో అద్దె ఇంట్లో ఐదేళ్లుగా ఈ కుటుంబం నివసిస్తోంది.

కల్యాణికి కోటపర్తి రవిశ్యామ్ అనే యువకుడు ఫోన్ ద్వారా పరిచయమ్యాడు. తనకు డబ్బులు ఇవ్వాలని, జీవితాంతం తనతో ఉండాలని, లేదంటే వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో పెడుతానని కల్యాణిని బెదిరింపులకు గురిచేశాడు. దీంతో పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఒకరి జోలికి ఒకరు రావద్దని ఒప్పంద పత్రం రాయించుకున్నారు. వారం రోజులుగా మళ్లీ రవిశ్యామ్ కల్యాణిని వేధిస్తున్నాడు. తనతో బయటికి రావాలని లేదంటే ఫొటోలు, వీడియోలు బయట పెడుతానని మళ్లీ బెదిరింపులకు గురిచేశాడు.

ఈ విషయం తెలిసిన అత్త రాజమ్మ, భర్త శంకర్ కల్యాణిని వేధిస్తుండటంతో ఆమె మనస్తాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి మామిడి సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జనజీవన స్రవంతిలోకి రండి

మావోయిస్టులకు భూపాలపల్లి ఎస్పీ ఖరే పిలుపు


నిషేధిత మావోయిస్ట్ నేతల ఫోటోలతో కూడిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న భూపాలపల్లి ఎస్పీ

భూపాలపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు అజ్ఞాత వాసాన్ని వీడి జన జీవన స్రవంతిలోకి రావాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే పిలుపునిచ్చారు. 10మంది మావోయిస్టుల ఫొటోలతో కూడిన పోస్టర్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన శనివారం ఆవిష్కరించారు. అడవుల్లో ఉండి మావోయిస్టులు సాధించేదేమీ లేదన్నారు. అజ్ఞాత వాసాన్ని వీడి ప్రశాంత జీవితాన్ని గడపాలని అన్నారు. మా వోయిస్టులకు ఎవరూ సహకరించొద్దని, వారి ఆచూకీ తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాం తంగా నిర్వహించామని, గోదావరి పరీవాహక ప్రాంతంలో నిఘాను పటిష్ఠం చేశా మని తెలిపారు. జిల్లా సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పోలీసులతో సమన్వ యంతో పనిచేస్తున్నామన్నారు. మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు ఏదో ఒక దుర్ఘటనకు పాల్పడే అవకాశం ఉందనే సమాచారం తమకు ఉందన్నారు. అటవీ గ్రామాల్లోని ప్రజలు మావోయిస్టులకు భయపడొద్దన్నారు. గ్రామాల్లోకి వారు వస్తే భూపాలపల్లి ఎస్పీ 8712658100, భూపాలపల్లి డీఎస్పీ, 8712658103, కాటారం డీఎస్పీ 8712658104 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని, లేదా డయల్ 100కు తెలపాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. మావోయిస్టులను ఎదుర్కొనేందుకు జిల్లా పోలీసు బృందం, సాయుధ బలగాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నారాయణ నాయక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీఐలు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి

దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి అమల్లోకి రానున్న చట్టాలపై అవగాహన తప్పనిసరి అని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసులకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్షా ్య అధినియం 2023 చట్టాలు రానున్న జూలై 1 నుంచి అమలులోకి రానున్నాయని అన్నారు. నూతన చట్టాల్లో మారిన సెక్షన్, చాప్టర్లను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. మారిన చట్టాలకు అనుగుణంగా కేసులను నమోదు చేసే విధంగా పూర్తిగా సంసిద్ధమై ఉండాలని అన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు కలుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ నూతన అంశాలను నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నారాయణ నాయక్, డీసీఆర్‌బీ, ఎస్‌బీ సీఐలు రామకృష్ణ, వసంత్ కుమార్, భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్, రిజర్వ్ సీఐలు రత్నం, కిరణ్, శ్రీకాంత్ జిల్లా పరిధిలోని ఎస్సైలు, కోర్టు డ్యూటీ అధికారులు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

గిరిజన మహిళను వేధిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి

మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు

ఏటూరునాగారం, జూన్ 1 : భర్తను కోల్పోయి కుటుంబ పోషణ కోసం వైజంక్షన్ వద్ద ఐటీడీఏ ఆర్థిక సహకారంతో మొబైల్ టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తున్న ఈసం స్వరూపను వేధిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆకులవారి ఘణపురంలో బాధితురాలిని ఆయన కలిశారు. అనంతరం మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఖాళీ చేయాలని మూడు నెలలుగా వేధిస్తున్నారని ఆరోపించారు. గిరిజన మహిళ అని కూడా చూడకుండా ఆమెను దుర్భాషలాడుతున్నారని అన్నారు. నిన్ను గోదావరిలో కలువుతామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై గతంలో తహసీల్దార్, ఎస్సై, సీఐలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గిరిజన భూములల్లో భవనాలు కట్టి వారి సంపదను అక్రమంగా దోచుకుంటున్నా వారిని ఉపేక్షించొద్దన్నారు. వెంటనే ఐటీడీఏ పీవో, ఏఎస్పీ, సీఐ, ఎస్సైలు వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నిజ నిర్ధారణ కమిటీ రాష్ట్ర నాయకుడు, ప్రధాన కార్యదర్శి వనపాకల దిలీప్, ఉమ్మడి జిల్లా సభ్యుడు కావిరి సంతోష్ తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

భూపాలపల్లిటౌన్, జూన్ 1: నాటుసారా, మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వి.శ్రీనివాస్ తెలిపారు. ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి మండలం పెద్దకుంటపల్లి, గొర్లవీడు తండాలో శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గుడుంబాతో పాటు మాదక ద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసుల సహకారం కోసం ఎస్పీ కిరణ్‌ఖరేను కోరినట్లు తెలిపారు. రెండు గ్రామాల్లో జరిపిన దాడుల్లో నలుగురిని నుంచి 40లీటర్ల నాటుసారా, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 1500 లీటర్ల పంచదార పానకాన్ని ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో సీఐ రమ్యరెడ్డి, రాజా సమ్మయ్య, ఎస్సై రబ్బాని, సిబ్బంది రఘుపతి, శ్రీకాంత్, విష్ణు, రాజేందర్, విజయ్, వెంకన్న, స్రవంతి, అలీ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయండి : సీపీఎం

కాటారం, జూన్ 1: సీపీఎం భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహించే జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు కోరారు. మండలకేంద్రంలో ఇసునం మహేందర్ అధ్యక్షతన శనివారం జరిగిన మండల కమిటీ సమావేశానికి సాయిలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జిల్లా, మండల నాయకులతో కలిసి శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని కార్ల్‌మార్క్స్ కాలనీలో జిల్లా స్థాయి శిక్షణా తరగతులు రెండు రోజుల పాటు జరుగుతాయన్నారు. వర్తమాన రాజకీయాల్లో జరుగుతున్న కార్యక్రమాలను, ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై తరగతులుంటాయన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు పోలం రాజేందర్, మండల కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, సభ్యులు శ్రీలత, బొడ్డు కిషోర్ తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలి

ఉద్యాన శాఖ జిల్లా అధికారి సంజీవరావు

చిట్యాల, జూన్ 1: జిల్లాలోని ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి సంజీవరావు అన్నారు. రైతులు విరివిగా ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలన్నారు. మండలంలోని నైన్‌పాక శివారులో సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ కంపెనీ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి ప్రతిపాదించిన స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. రహదారి నిర్మాణం, విద్యుత్, నీటి సౌకర్యం అనువుగా ఉన్న దృష్ట్యా ఫ్యాక్టరీ ఏర్పాటు త్వరలోనే పూర్తవుతుందన్నారు. తద్వారా ఈప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేయాలని సూచించారు. ఆయన వెంట ఉద్యాన శాఖ డివిజన్ అధికారి ఎడ్ల సునీల్, సువెన్ కంపెనీ నర్సరీ ఇన్‌చార్జి గవాస్కర్, అరవింద్ తదితరులు ఉన్నారు.

ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలి

ములుగు అదనపు కలెక్టర్ పి.శ్రీజ

వెంకటాపూర్(రామప్ప), జూన్ 1: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జవహర్‌నగర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. ఆమె వెంట డీఈవో పాణిని, సమగ్రశిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్షం రాజు, ఇన్‌చార్జి ఎంఈవో సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.

వెంకటాపురంలో రక్తదాన శిబిరం

వెంకటాపురం(నూగూరు), జూన్ 1: మండల కేంద్రంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం జరిగింది. 30 మంది యువకులు రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, విద్యుత్‌శాఖ ఏఈ సునీల్, స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాష్, స్థానిక యువకులు ఆకుల గోపి, గుండమల్ల మధు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సింగరేణి కార్మికుడి మృతి


అశోక్ (ఫైల్)

ములుగు, జూన్ 1: జిల్లా కేంద్రానికి చెందిన సింగరేణి కార్మికుడు మద్ది అశోక్(40) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. భార్య, ఇద్దరు కుమారులతో ములుగులో నివాసం ఉంటున్న అశోక్ భూపాలపల్లిలోని 8 ఇన్‌క్లైన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ములుగు కలెక్టరేట్, జూన్ 1: ములుగు మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ఆవరణలో ఈనెల 3న జిల్లాస్థాయి సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈపోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు ఈనలె 6,7 తేదీల్లో హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు పుట్టిన తేదీ ధ్రువపత్రంతో హాజరుకావాలని ఆయన సూచించారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి


గర్భాలయం ఎదుట కిక్కిరిసిన భక్తులు

మంగపేట, జూన్, 1: మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో శనివారం సందడి నెలకొంది. భక్తులు వందలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఉదయాన్నే కొండపైకి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. హనుమాన్ జయంతి కావడంతో అంజన్న భక్తులు కూడా భారీగా తరలివచ్చారు. చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయస్వామి, పంచముఖాంజనేయ స్వామి, వేణుగోపాలస్వామి, రమ సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. కొండపై వెలిసియున్న స్వయంభూ పుట్టుస్వామిగా విరాజిల్లుతున్న లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు కైంకైర్యం రాఘవాచార్యులు, ముక్కమల్ల రాజశేఖరశర్మ, అర్చకులు పవన్‌కుమారా చార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, అనిపెద్ది మురళీకృష్ణశర్మ, వెంకటనారాయణశర్మ స్వామివారి మూలవిరాట్‌కు తిలా, తైలాభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, గజమాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దైవ దర్శనాలను గావించారు. ఆలయ ఉద్యోగులు సీతారాములు, గోనే లక్ష్మీనారాయణ, శేషు తదితరులు పాల్గొన్నారు.